# పుంజుకుంటున్న పత్తి కొనుగోళ్లు

- గరిష్ఠంగా రూ. 6,950, కనిష్ఠంగా రూ.5వేలు ధర
- 16 నుంచి సీసీఐ ఆధ్వర్యంలో కొనుగోలుకు అధికారుల ఏర్పాట్లు

ఊట్కూర్, అక్టోబర్ 13 : పత్తి కొనుగోళ్లు రోజు రోజుకు పుంజుకుంటున్నాయి. జిల్లా వ్యాప్తంగా రైతులు రికార్డు స్థాయిలో వానకాలం పత్తి పంట సాగు చేశారు. ఊట్కూర్‌లోని విజయ కాటన్ ఇండస్ట్రీకి శుక్రవారం 300 క్వింటాళ్ల పత్తి విక్రయానికి రాగా క్వింటా గరిష్ఠంగా రూ. 6,950 కనిష్ఠంగా రూ. 5వేల ధర పలికింది. అలాగే మండలంలోని మల్లేపల్లి శివారులో గల వినాయక కాటన్ ఇండస్ట్రీకి 100 క్వింటాళ్ల పత్తి విక్రయానికి రాగా గరిష్ఠంగా రూ. 6,900 ధర పలికింది. పత్తి తేమ శాతం, నాణ్యతను బట్టి మద్దతు ధర చెల్లిస్తున్నామని ఇండస్ట్రీ యజమాని కిశోర్‌కుమార్, సూపర్‌వైజర్లు భీమశంకర్, వీరన్న తెలిపారు. రైతులు పండించిన పంటను పూర్తి స్థాయిలో కొనుగోలు చేస్తామని తెలిపారు. కాగా, గతేడాది పత్తి గరిష్ఠంగా రూ. 9వేలు ధర పలకగా ఈ ఏడాది ధరలు నేల చూపు చూడటంతో సీసీఐ ద్వారా పత్తి కొనుగోళ్లు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

రైతుల విజ్ఞప్తి మేరకు శుక్రవారం సీసీఐ అధికారులు, నారాయణపేట మార్కెట్ యార్డు అధికారులు ఇండస్ట్రీలను సందర్శించారు. సోమవారం నుంచి సీసీఐ ద్వారా పత్తి కొనుగోలు చేసేందుకు మార్గదర్శకాలను రైతులకు వివరించారు. సీసీఐ నిబంధనల మేరకు పత్తికి మద్దతు ధర చెల్లిస్తామని, రైతులు సహకరించాలని ఇండస్ట్రీ యజమానులు కోరారు.



పత్తి నాణ్యతను పరిశీలిస్తున్న కిశోర్‌కుమార్

రేపటి నుంచి

# వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు

- 23న కల్యాణోత్సవం, రథోత్సవం

మక్తల్,అక్టోబర్13: పట్టణంలో బ్రాహ్మణవాడలో వెలసిన వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు ఈ నెల 15 నుంచి 23 వరకు వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్త శ్యాంసుందర్ జోషీ, ఉత్సవ కమిటీ సభ్యులు శుక్రవారం ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటలకు ధ్వజారోహణతో బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ, ఉదయం 10 గంటలకు అలంకరణోత్సవం, సాయంత్రం 6 గంటలకు శేషవాహన సేవ, మహా మంగళ హారతి, 16 న ఉదయం 7:30 గంటలకు సూర్యప్రభ వాహనసేవ, రాత్రి 6:30 గంటలకు చంద్రప్రభ వాహన సేవ, 17న సాయంత్రం 6:30 గంటలకు కల్పవృక్ష వాహనసేవ, 18న సాయంత్రం సింహ్మా వాహన సేవ, 19న ఉదయం 8గటలకు కలశాభిషేకం, సాయంత్రం గరుడవాహన సేవ, 20న ఆంజనేయస్వామి వాహనసేవ, సాయంత్రం 6:30కి సుదర్శన వాహన సేవ, రాత్రి 7:30కి తులాభారం, 22న సాయంత్రం 5 గంటలకు గజవా హన సేవ, పడమటి ఆంజనేయ స్వామి ఆలయం నుంచి బ్రాహ్మణవాడలోని వేంకటేశ్వరస్వామి ఆలయం వరకు భజన, కోలాటం, మంగళవాయిద్యాలతో పుర వీధుల్లో స్వామివారి ఉత్సవ విగ్రహం ఊరేగింపు, 23న ఉదయం 8గంటలకు లక్ష్మీవేంకటేశ్వర స్వామి కల్యాణోత్సవం ఉదయం 11 గంట లకు రథోత్సవం, సాయంత్రం 5గంటలకు శమిపూజ అనంతరం పల్లకీ సేవ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. బ్రహ్మోత్సవాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి కృపకుపాత్రులు కావాలని కోరారు.



వేంకటేశ్వర స్వామి మూలవిరాట్టు

# చెక్‌పోస్టు వద్ద ముమ్మర తనిఖీలు



వాహనాలను తనిఖీ చేస్తున్న ఎక్సైజ్ , పోలీస్ సిబ్బంది

కృష్ణ, అక్టోబర్ 13 : మండలంలోని గుడెబల్లూర్ పంచాయతీ పరిధిలోని వాసునగర్ వద్ద గాల తెలంగాణ బార్డర్ చెక్ పోస్టు వద్ద శుక్రవారం స్థానిక పోలీసులు,ఎక్సైజ్ అధికారులు ఆధ్వర్యంలో ముమ్మర తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా కర్ణాటక రాష్ట్రం నుంచి వచ్చిన వాహనాలను క్షుణంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎక్సైజ్ సీఐ వెంకట్‌రెడ్డి, కృష్ణ ఎస్సై విజయ్ భాస్కర్ మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల దృ ష్ట్యా ఇతర రాష్ట్రాల నుంచి మద్యం, డబ్బు రాకుండా నియంత్రించేందుకు ముమ్మరంగా తనిఖీలు చేస్తున్నా మన్నారు. కార్యక్రమంలో పోలీస్, ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

# అధిక రుసుము వసూలు చేస్తే చర్యలు



మీసేవ నిర్వాహకులతో మాట్లాడుతున్న రెవెన్యూ అధికారులు

ఊట్కూర్, అక్టోబర్ 13: దరఖాస్తుదారుల నుంచి అధిక రుసుము వసూలు చేస్తే చర్యలు తప్పవని తాసీల్దార్ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ రాఘవేంద్రా రెడ్డి, ఆర్ఐ శ్రవణ్‌కుమార్ మీసేవ, ఇంటర్‌నెట్ నిర్వాహకులను హెచ్చరించారు. శుక్రవారం తాసీల్దార్ కార్యాలయంలో మీసేవ, ఇంటర్ నెట్ నిర్వాహకులతో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ మండలంలోని మీసేవ, ఇంటర్‌నెట్ నిర్వాహకులు ప్రభుత్వ నిబంధనల మేరకు దరఖాస్తుదారులతో రుసుము తీసుకోవాలని సూచించారు. దరఖాస్తుదారులు తమకు కావల్సిన ధ్రువ పత్రాల కోసం సంబంధిత మీ సేవ కేంద్రాల్లో ముందుగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ప్రతి దరఖాస్తు మీ సేవ కేంద్రాల ద్వారా వచ్చే విధంగా చూసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో మీసేవ నిర్వాహకులు ప్రకాశ్, ఆశాకిరణ్ తదితరులు పాల్గొన్నారు.

# పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాట్ల పరిశీలన



పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాట్లను పరిశీలిస్తున్న పుర, రెవెన్యూ అధికారులు

అమరచింత, అక్టోబర్ 13: పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల పాఠశాల, జిల్లా పరిషత్ బాలుర పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను మున్సిపల్ కమిషనర్ మహ్మద్‌ఖాజా, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ గోపాల్ తదితరులు సందర్శించారు. ఈ సందర్భంగా వారు పోలింగ్ కేంద్రాల్లో ఈవీఎంల ఏర్పాటుకు కావాల్సిన టేబుల్స్, విద్యుత్ ఏర్పాట్లను పరిశీలించి పోలింగ్ కేంద్రాల నెంబర్లు వేయించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ నారాయణపేట కలెక్టర్, మక్తల్ అసెంబ్లీ ఎన్నికల అధికారుల ఆదేశంతో మండలంలోని వివిధ గ్రామాల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేం ద్రాలను సందర్శించి కావాల్సిన ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.

# పాఠశాల ఆవరణలో పాము కలకలం

అమరచింత, అక్టోబర్ 13: పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో శుక్రవారం ఉదయం నాగుపాము కలకలం లేపింది. పాఠశాల ఆవరణలో ఆడుకుంటున్న పిల్లలకు రెండు అడుగుల కంట పడడంతో వారు భయాందోళనతో కేకలు వేశారు. అదే సమయంలో పాఠశాలలోని పోలింగ్ కేంద్రాలకు పరిశీలనకు వచ్చిన మున్సిపల్ కమిషనర్ మహ్మద్ ఖాజా సిబ్బందితో కలిసి పట్టుకున్నారు. కాగా ప్రభుత్వం దసరా సెలవులు ఇవ్వడంతో పాఠశాలలో విద్యార్థులు లేక పోవడంతో ప్రమాదం తప్పిందని స్థానికులు తెలిపారు.

# మండలానికి 847 గృహలక్ష్మి ప్రొసీడింగ్స్

హన్వాడ అక్టోబర్ 13 : మండలంలోని 33గ్రామ పంచా యతీలకు మొత్తం 847 గృహలక్ష్మి ప్రొసీడింగ్స్ మంజూరయ్యాయి. ఒక్కో ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం రూ.3లక్షలు అందజేయనున్నట్లు అధికారులు తెలిపారు.

# చిట్టి చిట్టిబతు కమ్మ..

ఊట్కూర్, అక్టోబర్ 13: మండలవ్యాప్తంగా మహిళలు, విద్యార్థులు బతుకమ్మ వేడుకలను ఘనంగా జరుపుకొంటున్నారు. శుక్రవారం మండలంలోని వివిధ గ్రామాల్లో మహిళలు చిన్నారులు రంగు రంగుల పూలతో బతుకమ్మను పేర్చి చిట్టి చిట్టి బతుకమ్మ .. చిన్నారి బతుకమ్మ అంటూ ఆడిపాడారు. కాగా తల్లిదండ్రులు తమ చిన్నారుల చేత బతుకమ్మలను తయారు చేయిస్తూ సోషల్ మీడియా వేదికగా ఫొటోలను షేర్ చేస్తున్నారు. బిజ్వారం గ్రామంలో చిన్నారి చేత బతుకమ్మను మోయించిన దృశ్యం ఆకట్టుకుంది.



### కృష్ణలో...

కృష్ణ, అక్టోబర్ 13 : మండలం గుడెబల్లూర్‌లోని ప్రైవేట్ పాఠశాలలో శుక్రవారం బతుకమ్మ సంబురాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యా యులు, విద్యార్థినులు తీరొక్క పూలతో బతుకమ్మను పేర్చి, పసుపుతో గౌరమ్మను తయారు చేసి ఆట పాటలు, కోలాటాల మధ్య ఆడిపాడారు. అనంతరం బతుకమ్మలతో ఊరేగింపుగా సమీప చెరువు వద్దకు చేరుకొని నీటిలో వదిలారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.

### మాగనూర్‌లో...

మాగనూర్ అక్టోబర్ 13: మండల కేంద్రంలోని ప్రైవేట్ పాఠశాలలో శుక్రవారం బతుకమ్మ సంబురాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయినులు, విద్యార్థినులు రకరకాల పూలతో బతుకమ్మలను సుంధరంగా అలంకరించి గౌరమ్మకు ప్రత్యేక పూజలు చేసి బతుకమ్మ పాటలతో ఆడిపాడారు. అనంతరం చిన్నవాగు వద్దకు బతుకమ్మతో ర్యాలీగా వెళ్లి ప్రత్యేక పూజలు చేసి నీటిలో వదిలారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మహేశ్వరీ, సంధ్య, భారతి, ప్రియాంక, నర్సింహులు, మనేష్, మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.



కృష్ణలో బతుకమ్మకు పూజ చేస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థినులు



మాగనూర్‌లో బతుకమ్మ సంబురాలలో పాల్గొన్న విద్యార్థులు